అటకెక్కిన పాలిథిన్ నిషేధం

- రాజాంలో పెరిగిపోతున్న ప్లాస్టిక్ వినియోగం
- చేతులెత్తుస్తున్న శానిటేషన్ విభాగం
- డంపింగ్ యార్డులో 70 శాతం మేర ప్లాస్టిక్ వ్యర్థాలు
- విచ్చలవిడిగా నిషేధిత ప్లాస్టిక్ వస్తు, సామగ్రి విక్రయాలు
- అపరాధ రుసుముతో సరిపెడుతున్న అధికారులు
- కానరాని వ్యర్థాల నిర్వహణ ప్లాంట్‌లు



రాజాం పట్టణ డంపింగ్‌యార్డు నిండా పాలిథిన్, ప్లాస్టిక్ వస్తువులు

రాజాం: రాజాం మున్సిపాలిటీ పరిధిలోని దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్ల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. వ్యాపారాలు, కొనుగోలు దారులు వీటిని అధికంగా ఉపయోగిస్తున్నారు. ప్లాస్టిక్ నిషేధం విధిం చినా ఎవరూ పట్టించుకోవడంలేదు. కొందరు హోల్‌సేల్ వ్యాపారులు అధికార పార్టీ నేతల అండదండలతో ఇతర రాష్ట్రాల నుంచి భారీగా ప్లాస్టిక్ కవర్లను తీసుకొచ్చి స్థానికంగా విక్ర యిస్తున్నట్లు తెలు స్తోంది. గతంలో మున్సిపల్ డం పింగ్ యార్డుకు వెళ్లే చెత్తలో అయిదుశాతం కంటే తక్కువగానే ప్లాస్టిక్ కవర్లు కనిపించేవి. ఇప్పుడు వాటి శాతం 50 వరకు పెరిగిందని అధికారులే లెక్క లేస్తున్నారు. మున్సి పాలిటీ పరిధిలో ప్లాస్టిక్ నిషేధం ఉన్నా పట్టించుకోకుండా వీటిని వినియో గించి, పర్యావరణానికి ముప్పుతేవడంపై పర్యావర ణ ప్రేమికులు ఆందోళన చెందుతున్నారు.

ప్రతీ నెల 30 టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు

రాజాం పట్టణానికి చుట్టు పక్కల మండలాల నుం చి రోజూ వేలాదిమంది వస్తుంటారు. ఉదయం రైతు బజార్, మార్నింగ్ మార్కెట్, సంతమార్కెట్ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున వ్యాపారాలు సాగుతున్నాయి. ఈ వ్యాపారాలు కూరగాయలు, పండ్లు ఇతర సామగ్రిని వినియోగదారులకు విక్రయించేందుకు నిషేధిత పాలిథిన్ సంచులను వినియోగిస్తున్నారు. ఇవే కాకుండా మాధవబజార్, శ్రీనివాస రోడ్డు ప్రాంతాల్లో పాలిథిన్ సంచులు, ప్లేట్లు, వస్తువులు విక్రయాల షాపులు అధికంగా ఉన్నాయి. గుట్టుగా విక్రయాలు చేస్తూ అధికారుల కళ్లు కప్పుతున్నారు. ఈ పాలిథిన్ సంచులు వినియోగించడం , వాడిన వాటిని ఎక్కడిక క్కడే పారేయడంతో పట్టణంలో ప్లాస్టిక్ వ్యర్థాలు పెరిగిపోతున్నాయి. రోజూ సేకరిస్తున్న చెత్తలో సగటున టన్నుకు పైగా పాలిథిన్ సంచులు, ప్లాస్టిక్ బాటిళ్లు ఉంటున్నాయని పారిశు ద్ధ్య కార్మికులు వాపోతున్నారు. నెలకు 30 టన్నుల మేర ప్లాస్టిక్ వ్యర్థాలను గార్రాజుచీపురుపల్లి వద్ద డంపింగ్‌యార్డులో పారబోస్తున్నారు. ఈ యార్డులో ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ ప్లాంటు పనిచేయకపోవడంతో వ్యర్థాలు కుప్పలుగా పేరుకుపోతున్నాయి. అక్కడి చెత్త కుప్పల్లో 70 శాతంమేర ప్రమాదకర పాలాథిన్, ప్లాస్టిక్ వస్తువులే ఉన్నాయి.

ఫెనాల్టీ..షరా మామూలే



పాలకొండరోడ్డులో డస్ట్‌బిన్‌ల వద్ద ప్లాస్టిక్ వ్యర్థాలు

పట్టణంలో అధికంగా మాధవబజార్, శ్రీనివాసమార్కెట్ ప్రాంతాల్లో వర్తకులు పాలిథిన్ సంచులు విక్రయిస్తున్నారు. 12 మైక్రాన్‌ల మందంకంటే తక్కువగా ఉన్న సంచులు వినియోగించ రాదనే నిబంధనలు ఉన్నాయి. ప్రధానంగా మున్సిపాల్టీల్లో వీటిని వినియోగించినా, విక్రయించినా, కొనుగోలు చేసినా రూ. 10 వేల జరి మానా విధించాల్సి ఉంది. అధికారులు వీటిని పట్టించుకోకుండా, తూతూ మంత్రంగా అపరాధ రుసుం విధిస్తుండడంతో పాలిథిన్ నిషేధం అటకెక్కింది.

చర్యలు తీసుకుంటున్నాం.



పట్టణంలో ప్లాస్టిక్ నిషేధం అమలుచేస్తున్నాం. పలుషాపుల్లో నిషేధిత ప్లాస్టిక్ వస్తుసామగ్రి, సంచుల వినియోగంపై చర్యలు చేపడుతున్నాం. నోటీసులు ఇవ్వ డం, అపరాధరుసుం విధించడం చేస్తున్నాం. ఎక్కువ ఫెనాల్టీ వేస్తే ఒత్తిళ్లు వస్తున్నాయి. వ్యాపారులు, పట్టణవాసులు సహకరిస్తేనే పాలిథిన్ నిషేధం సాధ్యం.

– సీహెచ్.ప్రసాద్, రాజాం మున్సిపాలిటీ శానిటరీ ఇన్‌స్పెక్టర్

ఎమ్మెల్సీ పరామర్శ



కాంతారావును పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్, వైఎస్సార్‌సీపీ నేతలు

రాజాం: మండలంలోని మొగిలివలస గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యుడు బొరోతు కాంతారావును ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, వైఎస్సార్‌సీపీ నాయకులు శనివారం పరామర్శించారు. కాంతారావు తల్లి బొరోతు పెద్దమ్మి ఇటీవల మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ మొగిలివలస చేరుకుని కాంతారావును, ఆయన కుటుంబసభ్యులను పరామర్శించి, పెద్దమ్మి మృతికి కారణాలను తెసుసుకున్నారు. ఆయన వెంట స్థానిక సర్పంచ్ వాకముల్ల చిన్నంనాయుడు, వైఎస్సార్‌సీపీ రాజాం రూరల్ అధ్యక్షుడు లావేటి రాజగోపాలనాయుడు, సర్పంచ్‌లు వంజరాపు విజయ్‌కుమార్, వెంకటరమణ, మండల వ్యవసాయ సలహా మండలి మాజీ అధ్యక్షుడు కోనారి అప్పారావు, నాయకులు కామోదుల శ్రీరంగం నాయుడు, తదితరులు ఉన్నారు.

ఘనంగా నందెన్న అనుపోత్సవం



తెర్లాం:జగన్నాథవలసలో అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు



రాజాం సిటీ: కొండంపేటలో నందెన్న, గౌరమ్మ విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధి కొండంపేట గ్రామంలో బాదిరెడ్డి కుటుంబం ఆధ్వర్యంలో వారం రోజుల పాటు నిర్వహించిన నందెన్న సంబరాలు శనివారం సాయంత్రం అనుపో త్సవంతో ముగిశాయి. వారం రోజులుగా పూజలందుకున్న నందెన్న, గౌరమ్మ విగ్రహాలను మంగళ వాయిద్యాల నడుమ ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

జగన్నాథవలసలో అన్నదానం

తెర్లాం: నందెన్న సంబరాల్లో భాగంగా జగన్నాథవలసలో తీగల భాస్కరరావు, మల్లేశ్వరి దంపతులు శనివారం అన్నదానం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ గొండాల కుమారి, మామిడి ఉత్పత్తిదారుల సంఘం మండల అధ్యక్షుడు వెంకటరావు, స్థానిక నాయకులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

రోడ్డుపై గుంతలను పూడ్చిన యువత



గుంతలను పూడ్చుతున్న విద్యార్థులు



మట్టి తవ్వుతున్న యువకులు

తెర్లాం: మండలంలోని లోచర్ల గ్రామ రోడ్డు గోతుల మయం కావడంతో రాకపోకలు సాగించేందుకు గ్రామస్తులు, ప్రయాణికులు ఇబ్బందిపడుతున్నారు. రోడ్డు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నా అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడంతో ఆ గ్రామ యువత, పాఠశాల విద్యార్థులు శనివారం శ్రమదానం చేసి గోతులు పూడ్చారు. రోడ్డు పక్కన ఉన్న మట్టిని తవ్వి గోతులను పూడ్చారు. యువకులను, విద్యార్థులను గ్రామస్తులు అభినందించారు.

పంటకోత ప్రయోగాలపై శిక్షణ

వంగర: మండలంలోని పలుగ్రామాల రైతు సేవా కేంద్రాల వీఏఏలు, వీహెచ్‌ఏలకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వరి పంట కోత ప్రయోగాలపై వ్యవసాయశాఖ శనివారం శిక్షణ నిర్వహించింది. తహసీల్దార్ పిన్నింటి రాంబాబు, మండల వ్యవసాయ అధికారి టి.కన్నబాబు మాట్లాడుతూ వరి పంట దిగుబడిని అంచనా వేసేందుకు నిర్దేశించిన లక్ష్యాల మేరకు పంట కోత ప్రయోగాలను సకాలంలో పూర్తి చేయాలని చెప్పారు. పంట నమోదుకు సంబంధించి ల్యాండ్ పార్శిల్‌ను ఈనెల 25లోగా ఏఓ కార్యాలయాలకు అందించాలని, రైతులు, సర్వేయర్లు పంట కోత ప్రయోగాలు చేసే సిబ్బందికి సహకరించాలని సూచించారు.

మద్యం నాణ్యతా ప్రమాణాల పరిశీలన



రాజాం: మద్యం నాణ్యత పరిశీలిస్తున్న ఎక్సైజ్ పోలీసులు



బొబ్బిలి: మద్యం దుకాణంలో తనిఖీలు చేస్తున్న సీఐ చిన్నం నాయుడు

రాజాం: రాజాంలోని పలు మద్యం దుఖాణాల్లో విక్రయిస్తున్న మద్యం నాణ్యతా ప్రమాణాలను రాజాం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ అధికారులు శనివారం పరిశీలించారు. రాజాం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సీఐ ఆర్.జైభీమ్ మాట్లాడుతూ స్టేషన్ పరిధిలోని అన్ని మద్యం దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రొహిబిషన్ ఎస్ఐ జి.మాన్యాలు మాట్లాడుతూ గత ఏడాది కాలంగా మద్యం దుకాణాల్లో మద్యం సీసాల నుంచి 336 శాంపిల్స్ సేకరించి, నాణ్యత పరిశీలించామని తెలిపారు. ఎక్కడైనా కల్తీ మద్యం విక్రయాలు జరుగుతున్నట్లు అనుమానం వస్తే వెంటనే 14405 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

బొబ్బిలిలో..

బొబ్బిలి: నియోజకవర్గంలోని మూడు బార్లు, 25 మద్యం దుకాణాల నుంచి గడచిన సెప్టెంబర్ నుంచి నేటి వరకు 230 శాంపిళ్లను సేకరించి విశాఖలోని ఎక్సైజ్ లేబొరేటరీకి పంపించామని బొబ్బిలి ఎక్సైజ్ సీఐ పామోటి చిన్నంనాయుడు తెలిపారు. బొబ్బిలిలో మద్యం దుకాణాలు, బార్లలో శనివారం తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ తరచూ మద్యం నిల్వలను పరీక్షిస్తూ శాంపిల్స్ సేకరిస్తున్నామని, ఇప్పటివరకూ సేకరించిన శాంపిల్స్ ఫలితాలు సక్రమంగా ఉన్నట్టు వచ్చాయన్నారు. కల్తీ మద్యం తయారు చేసినా, విక్రయిస్తున్నట్టు తెలిసినా తమకు సమాచారం లేదా ఫిర్యాదు ఇవ్వవచ్చన్నారు.

ఆయన నేత్రాలు సజీవం



చింతల లక్ష్మణరావు (ఫైల్)

రామభద్రపురం: మరణించినా ఆయన నేత్రాలు సజీవంగానే ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన చింతల లక్ష్మణరావు(56) కొద్ది రోజులుగా అనారోగ్యంతో విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. ఆయన కళ్లు మట్టిలో కలిసిపోకుండా ఇద్దరు అంధులకు కంటి చూపు ప్రసాదించాలని భావించిన కుటుంబ సభ్యులు నేత్ర దానానికి ముందుకు వచ్చారు. ఈ విషయాన్ని విశాఖపట్నం లోని ఎల్.వి.ప్రసాద్ ఐ బ్యాంకుకు సమాచారం ఇచ్చారు. దీంతో ఐబ్యాంకు టెక్నీషియన్లు కేజీహెచ్‌కు వచ్చి మృతుడు లక్ష్మణరావు కార్నియాలను సేకరించారు.

ఈకేవైసీలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు



వెలగవలసలో వేతనదారుల ఈకేవైసీ నమోదును పరిశీలిస్తున్న ఏపీఓ సుశీల

తెర్లాం: గ్రామాల్లో ఉపాధి హామీ వేతనదారుల ఈకేవైసీ నమోదులో నిర్లక్ష్యం వహించే ఫీల్డ్ అసిస్టెంట్లపై చర్యలు తప్పవని ఉపాధి హామీ పథకం ఏపీఓ సుశీల అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న ఈకేవైసీ నమోదు ప్రక్రియను శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షేత్ర సహాయకులు, మేట్లు గ్రామాల్లోని వేతనదారులకు సకాలంలో ఈకేవైసీ నమోదు పూర్తి చేయాలన్నారు. ఈకేవైసీ నమోదులో లోపాలున్నా, నిర్లక్ష్యం ప్రదర్శించినా శాఖాపరమైన చర్యలు తీసుకునేందుకు వెనుకాడేదిలేదన్నారు. ఆమె వెంట ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్ త్రినాథ నాయుడు, తదితరులు ఉన్నారు.

ఈసీ మెంబర్‌గా ప్రిన్సిపాల్ రామారావు



డి.రామారావు

రాజాం సిటీ: స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డి.రామారావు జూనియర్ కళాశాలల రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా ఎన్నికయ్యారు. విజయవాడలో శనివారం జరిగిన కమిటీ సభ్యుల ఎన్నికలో తనను ఈసీ మెంబర్‌గా ఎన్నుకున్నారని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈయనకు కళాశాల అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



ఎం.ఎస్ ప్రకాశరావును సత్కరిస్తున్న హైకోర్టు న్యాయవాది వేణుగోపాలనాయుడు, తదితరులు

రేగిడి: స్థానిక విశ్వసాయి మందిరంలో సత్య సాయి బాబా శత జయంతి వేడుకలు శనివారం నిర్వహించారు. 300 మంది భక్తులు పాల్గొని సత్యసాయికి పూజలు చేశారు. అతిథిగా హాజరైన రాష్ట్ర సత్యసాయి సేవా సంస్థల సాంస్కృతిక విభాగం సమన్వయకర్త ఎం.ఎస్.ప్రకాశరావు మాట్లాడుతూ ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందని అన్నారు. ప్రకాశ రావును మందిర నిర్మాణకర్త, హైకోర్టు న్యాయవాది మామిడి వేణుగోపాలనాయుడు సత్కరించారు. సత్యసాయి సేవా సంస్థల జోన్ కన్వీనర్ రాజు, జిల్లా, మండల సమన్వయకర్తలు వి.వి.సత్యనారాయణ, హైమ, భజన మండలి కన్వీనర్ లావేటి విష్ణు, మామిడి శివప్రసాద్,తదితరులు పాల్గొన్నారు.

కుటీర పరిశ్రమగా నకిలీ మద్యం తయారీ

- రేపు ఎక్సైజ్ సర్కిల్ స్టేషన్ వద్ద నిరసన – మాజీ ఎమ్మెల్యే శంబంగి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు

బొబ్బిలి: టీడీపీ కూటమి ప్రభుత్వంలో నకిలీ మద్యం తయారీకి రాష్ట్రంలో కుటీర పరిశ్రమలు వెలశాయని, ఊరూరా బెల్ట్ షాపులతో మద్యాన్ని ఏరులై పారిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనా యుడు ఆరోపించారు. బొబ్బిలిలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కల్తీ మద్యం మరణాలను నివారించి, మద్యం విచ్చల విడి విక్రయాలను నిలుపుదల చేయాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిరసన తెలియజేయనున్నామని చెప్పారు.ఈనెల 13న (సోమవారం) స్థానిక ఎక్సైజ్ సర్కిల్ స్టేషన్ వద్ద నిరసన తెలియజేసి, అధికారులకు వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటలకు నియోజకవర్గంలోని మహిళా నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు వైఎస్సార్‌సీపీ కార్యాలయానికి చేరుకోవాలని కోరారు. అధికార పార్టీ నాయకులే నకిలీ మద్యం తయారు చేసి ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగిస్తున్న వైనాన్ని ప్రజలందరికీ తెలియజెప్పాల్సిన సమయం వచ్చిందన్నారు.

సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుడిదే కీలక భూమిక



అప్పారావు మాస్టారు దంపతులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు, అతిథులు

తెర్లాం: సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుడిదే కీలక భూమిక అని పలువురు వక్తలు అన్నారు. మండలంలోని నందిగాం ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన మాడుగుల వెంకట అప్పారావు దంపతులను ఆ పాఠశాలలో సహ ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు శనివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ 36 ఏళ్లుగా ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతూ అందరి మన్ననలు పొందడం అభినందనీయ మన్నారు. సమాచార శాఖ డీడీ దున్న రమేష్, యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి,హెచ్‌ఎం శ్రీధర్, ఎస్.ఎం.పురం రెసిడెన్షియల్ స్కూల్ రిటైర్డ్ ప్రిన్సిపాల్ పాలిశెట్టి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

న్యాయవ్యవస్థలో మనువాద సిద్ధాంతమా..?



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

బొబ్బిలి: బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ మనువాద సిద్ధాంతాన్ని అన్ని రంగాలతో పాటు న్యాయవ్యవస్థకు కూడా ఆపాది స్తూ వస్తున్నట్టుందని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పొట్నూరు శంకరరావు ఆరోపించారు. స్థానిక కోరాడ వీధి జంక్షన్ రహదారిపై శనివారం నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ప్రధానన్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయిపై న్యాయవాది బూటు విసురుతూ మాట్లాడిన మాటలు దీనికి బలం చేకూర్చుస్తున్నాయన్నారు. సనాతన ధర్మాన్ని ఎవరు అవమాన పరచినా అంగీకరించమంటూ హెచ్చ రించే విధంగానే న్యాయవాది మాట్లాడడం విచారకరమన్నారు. మన న్యాయవ్యవస్థ, రాజ్యాంగానికి పెద్ద ప్రమాదం పొంచి ఉందన్నారు. ఈ ప్రమాదం నుంచి ప్రజలే రక్షించు కోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. భారతదేశ అత్యున్నత న్యాయస్థానంలో ప్రధాన న్యాయమూర్తిపై ఓ న్యాయవాది మతోన్మాదంతో బూటు విసర డం దేశానికే సిగ్గు చేటన్నారు. ఈ ఘటనను అంతా వ్యతిరేకించాలని, బూటు విసిరిన న్యాయవాదిపై చట్టపర మైన చర్యలు తీసుకోవాలని కోరారు. సీపీఎం నాయకులు యుగంధర్,జి.గౌరి,వాసు, బి.వెంకటి, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద రహిత దీపావళికి చర్యలు



మాట్లాడుతున్న సీఐ నారాయణరావు

రామభద్రపురం: ప్రమాదరహిత దీపావళికి పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నట్లు సీఐ కె.నారాయణరావు తెలిపారు.స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. దీపావళి పండగ నేపథ్యంలో తాత్కాలిక బాణసంచా దుకాణాలకు అనుమ తులు పొందిన వారు నిర్దేశించిన ప్రదేశాల్లోనే దుకాణాలను ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. ఎప్పటికప్పుడు పర్యటిస్తూ బాణ సంచా తయారీ, విక్రయకేంద్రాల లైసెన్స్‌లు,వాటికి అనుగుణంగా బాణసంచా పరిమితి,నిబంధనలు పాటిస్తున్నారా లేదా?, అక్రమ నిల్వలు లేకుండా, అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు.అనుమతులు లేకండా బాణసంచా తయారు చేయడం,పరిమితికి మించి నిల్వలు ఉండడం, అనధికార గోదాముల్లో సరుకు నిల్వచేయడం వంటివి చేస్తే ఏమాత్రం ఉపేక్షించేదిలేదని, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్ఐ వి.ప్రసాదరావు పాల్గొన్నారు.

రోడ్ల పునరుద్ధరణకు శంకుస్థాపన

బొబ్బిలిరూరల్: మండలంలోని అలజంగి,కారాడ గ్రామాల మధ్య బీటీ రోడ్ల పునరుద్ధరణ పనులకు అల జంగి జంక్షన్ వద్ద ఎమ్మెల్యే బేబి నాయన, బుడాచైర్మన్ తెంటు లక్ష్మునాయుడు శని వారం శంకుస్థాపన చేశారు.రూ.4.5 కోట్ల ఎస్‌ఏఎస్‌సీఐ నిధులతో రోడ్డు పనులు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఆర్‌అండ్‌బీ అధికారులు,టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఏడాదిగా మొరపెట్టుకున్నా..

బాడంగి: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో పాటు రోడ్ల భవనాలశాఖ మంత్రి వద్ద ఏడాదిగా మొరపెట్టుకొంటే తప్ప నియోజకవర్గంలో రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరు కాలేదని ఎమ్మెల్యే బేబీనాయన అన్నారు. మండలంలోని ఆకులకట్ట– పినపెంకి గ్రామాల బీటీ రోడ్డు పునరుద్ధరణకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. రూ.2.90 కోట్ల నాబార్డు నిధులతో పనులు చేపట్టనున్నట్టు చెప్పారు. బుడా చైర్మన్ లక్షునాయుడు, స్థానిక ససర్పంచ్ ఉయ్యాల సత్యనారాయణ, ఆర్ అండ్‌బీ అధికారులు,నాయకులు పాల్గొన్నారు.

బాలికా విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలి



ఎన్‌జీఓ హోమ్‌లో నిర్వహించిన వేడుకల్లో బాలికలతో యూటీఎఫ్ రాష్ట్ర నాయకురాలు విజయగౌరి



కేజీబీవీలో విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఐసీడీఎస్ పీఓ విజయలక్ష్మి, తదితరులు



బొబ్బిలిలోని ఇందిరమ్మ కాలనీలో బాలికలకు పుస్తకాలు అందజేస్తున్న కారుణ్య ఫౌండేషన్ అధ్యక్షుడు జె.సి.రాజు

బొబ్బిలి: బాలికల విద్యకు ప్రభుత్వాలు ప్రాధాన్యత ఇచ్చినప్పుడే వారి అభ్యున్నతి సాధ్యమని పలువురు వక్తలు అన్నారు. ఐసీడీఎస్‌పీఓ జె.విజయలక్ష్మి, యూటీ ఎఫ్ రాష్ట్ర నాయకురాలు కె.విజయగౌరి, కారుణ్య ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు జె.సి.రాజుల ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని శనివారం వేర్వేరుగా నిర్వహించారు. బాలికలకు పుస్తకాల పంపిణీ చేయడంతో పాటు ఆటలు,పాటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతుల అందశారు. బాలికల రక్షణ చట్టాలు, హక్కులపై అవగాహన కల్పించారు.

క్లుప్తంగా

నిత్యావసర సరుకుల పంపిణీ



వృద్ధుడికి నిత్యావసర సరుకులు అందిస్తున్న యువజన సంఘం సభ్యుడు

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధి పొనుగుటివలస గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబాలకు ఆ గ్రామానికి చెందిన యువత శనివారం నిత్యావసర సరుకులు అందజేశారు. గ్రామంలో రెండు కుటుంబాలను దత్తత తీసుకుని ప్రతీ నెల వారికి సరుకులు అందిస్తున్నామని శివరామాంజనేయ యువజన సంఘం సభ్యులు ఆర్.శ్రీనివాసరావు, బి.కృష్ణమూర్తి, జి.గోవిందరావు తెలిపారు.

దోమల నివారణకు ఫాగింగ్



ఫాగింగ్‌ను పరిశీలిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్

రాజాం: పట్టణంలోని పలువార్డుల్లో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.ప్రసాద్ దోమల నివారణకు ఫాగింగ్ చేయించారు. పట్టణంలో అన్ని వార్డుల్లో ఈకార్యక్రమం రోజూ సాయంత్రం నిర్వహిస్తున్నామని ఆయన చెప్పారు. మల్లికార్జునకాలనీలో ఫాగింగ్‌ను ఆయన పరిశీలించారు.

తప్పెట గుళ్లు కళాకారుడికి సత్కారం



సత్యంను సత్కరిస్తున్న ఎమ్మెల్యే బేబీ నాయన, తదితరులు

బాడంగి: మండలంలోని జి.కె.ఆర్.పురంగ్రామానికి చెందిన తప్పెట గుళ్ల కళాకారుడు నీలబోను సత్యంను ఆ గ్రామస్తులతో పాటు బొబ్బిలి ఎమ్మెల్యే బేబీ నాయన,బుడా చైర్మన్ తెంటు లక్ష్మునాయుడు శనివారం సత్కరించారు. ఈ ఏడాది జూలైలో జపాన్‌లో జరిగిన అంతర్జాతీయ సాంస్కృతిక పోటీల్లో భారతీయ సాంస్కృతిక సంస్థ తరఫున నీలబోను సత్యం బృందం తప్పెట గుళ్లు ప్రదర్శించి, ప్రశంశలు అందుకుంది. ఈ నేపథ్యంలో సత్యంను గ్రామస్తులు సన్మానించి, అభినందనలు తెలిపారు. పాల్తేరు సొసైటీ అధ్యక్షుడు బొంతు త్రినాథ నాయుడు,పాల్తేరు ఛానెల్ టీసీ మెంబరు పెంట సత్యనారాయణ, అల్లాడ భాస్కరరావు,తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఆత్మ పథకం జిల్లా సంచాలకులు శ్రీనివాసరావు

రామభద్రపురం: వరి సాగులో సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ(ఆత్మ) జిల్లా సంచాలకులు ఆర్.శ్రీనివాసరావు అన్నారు. ముచ్చర్లవలస గ్రామంలో ఏఓ ఎం.శివ ఆధ్వర్యంలో రైతులకు వరి సస్యరక్షణ చర్యలపై శనివారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రస్తుతం వరి పంటను ఎండు ఆకు, ఆకు ముడత తెగుళ్లు ఆశించినట్లు గుర్తించామన్నారు. తెగుళ్ల నివారణకు వ్యవసాయాధికారులు సూచనల మేరకు సకాలంలో పురుగు మందులు పిచికారీ చేయాలన్నారు.సర్పంచ్ కనిమెరక శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప దీక్షలు ప్రారంభం



భక్తులకు మాలధారణ చేస్తున్న గురుస్వామి

రాజాం సిటీ: అయ్యప్పస్వామి మండల దీక్షలు శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. స్థానిక శాస్తా సమాజంతో పాటు బస్టాండ్ వెనుక భాగంలోని అయ్యప్పసన్నిధానం, కొండంపేట, పాలకొండ రోడ్డులోని అయ్యప్పస్వామి ఆలయాల వద్ద భక్తులకు గురుస్వాములు మాలధారణ చేశారు. 41 రోజులపాటు దీక్షలు చేపట్టనున్న స్వాములకు గురుస్వామి ఉమాపతి నియమనిబంధనలు తెలియజేశారు. అంతకుముందుకు అయ్యప్పస్వామికి పంచామృతాభిషేకాలు, విశేష పూజలు చేశారు.